భూమికి సారం.. రైతుకు వరం

- పచ్చిరొట్ట ఎరువుతో పంటకు మేలు
- సారవంతం కానున్న పొలాలు
- చౌడు భూములకు మరింత ప్రయోజనం
- తుని సబ్ డివిజన్‌లో 30 టన్నుల పచ్చిరొట్ట విత్తనాలకు ప్రతిపాదనలు



అల్లిపూడిలో సాగు చేసిన జీలుగ పచ్చిరొట్ట ఎరువు (ఫైల్)

కోటనందూరు: పచ్చిరొట్ట ఎరువు పంట పొలాలకు బలం చేకూర్చుతుంది. భూమికి సారాన్నిస్తుంది. మంచి దిగుబడి లభిస్తుంది. అడ్డూ అదుపు లేకుండా వినియోగిస్తున్న రసాయనిక ఎరువులు, పురుగు మందులతో నిస్సారమైపోతున్న పంట పొలాలను పచ్చిరొట్ట సాగు చేసి కాపాడుకోవచ్చు. ప్రస్తుతం ఆరోగ్యవంతమైన అధిక దిగుబడులు సాధించాలన్నా, భవిష్యత్ తరాలకు సారవంతమైన భూములు అందించాలన్నా పచ్చిరొట్ట వినియోగం ఎంతో మేలైంది. రైతులు ఖరీఫ్ సాగుకు ముందు పచ్చిరొట్ట ఎరువు సాగు చేస్తే ఆ తరువాత పండించే పంటలకు ఆరోగ్యవంతమైన దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. రైతులు పచ్చిరొట్ట ఎరువులపై అవగాహన పెంచుకొని మేలైన దిగుబడి సాధించాలని వారు సూచిస్తున్నారు.

ఇదీ పరిస్థితి

తుని సబ్‌డివిజన్ పరిధి ఐదు మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్‌లో 38, 555 ఎకరాల్లో వరి సాగు చేయనున్నారు. తుని మండలంలో 6,500 ఎకరాలు, తొండంగిలో 14,100 ఎకరాలు, రౌతులపూడి 4,718 ఎకరాలు, శంఖవరం 3,737 ఎకరాలు, కోటనందూరు మండలంలో 9,500 ఎకరాల్లో వరిసాగు చేస్తారని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. సబ్‌డివిజన్ పరిధిలో 98 రైతు భరోసా కేంద్రాల ద్వారా 30 టన్నుల పచ్చిరొట్ట విత్తనాలకు ప్రతిపాదనలు పంపించామని, ఈ నెలాఖరు నాటికి పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులోకి రానున్నట్టు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఎకరానికి 12 కేజీల చొప్పున పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకుంటే మంచి ఫలితాలు వస్తాయని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

20 రోజుల ముందే..

ఖరీఫ్ సాగుకు ముందు రెండు పర్యాయాలు దున్నిన పంట పొలంలో నేల స్వభావాన్ని బట్టి పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాల్లో ఏదొకటి చల్లుకోవాలి. విత్తనాలు చల్లిన 20 నుంచి 25 రోజుల్లో పచ్చిరొట్ట ఏపుగా ఎదుగుతుంది. మొక్కదశలో లేతగా ఉన్నప్పుడు మొక్కల మొదళ్ల వద్ద కత్తిరించి భూమిలో కలియదున్నాలి. దుక్కు చేసేటప్పుడు 100 కిలోల సూపర్ పాస్ఫేటును వేసి దున్నినట్టయితే పచ్చిరొట్ట బాగా కుళ్లి నేలకు సారాన్ని అందిస్తుంది. ఈ పచ్చిరొట్ట ముఖ్యంగా చౌడు నేలలకు మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. చౌడు భూముల్లో పచ్చిరొట్ట వేయడం ద్వారా భూమిలో గుల్లతనం పోయి సేంద్రియ పోషకాలు పుష్కలంగా భూమికి అందుతాయి. పచ్చిరొట్ట ఎరువులో నత్రజని శాతం అధికంగా ఉండడంతో రైతు సాగులో నత్రజని వినియోగించాల్సిన అవసరం ఉండదు.

ఆరోగ్యవంతమైన దిగుబడి

సాగులో గ్రీన్ మెన్యూర్ వినియోగంతో ఆరోగ్యవంతమైన అధిక దిగుబడులు సాధించవచ్చు. పచ్చిరొట్ట ఎరువు వినియోగించి పండించిన పంటపై ఎటువంటి దుష్ప్రభావం పడకపోవడం, భూమి సారవంతం కావడంతో సాధారణం కంటె అధిక దిగుబడి సాధించవచ్చు. పచ్చిరొట్ట వినియోగించిన పంట దిగుబడులతో ప్రజలకు ఆరోగ్య సమస్యలుండవు.

ఆర్బీకేల ద్వారా అవగాహన

రాష్ట్ర ప్రభుత్వం సేంద్రియ సాగును ప్రోత్సహిస్తోంది. అందుకు అనుగుణంగా ఈ ఏడాది వ్యవసాయాధికారులు రైతు భరోసా కేంద్రాల్లో రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి పచ్చిరొట్టపై అవగాహన కల్పిస్తున్నారు. పచ్చిరొట్ట ఎరువు సాగు, కలిగే ప్రయోజనాలు గురించి వివరించి చెబుతున్నారు. భూములు నిస్సారమైపోయి రాను రాను దిగుబడులు తగ్గిపోతున్న తరుణంలో సేంద్రియం వైపు అడుగులేయాలని రైతులకు సూచిస్తున్నారు.

ఎంతో ప్రయోజనం



పచ్చిరొట్ట ఎరువులతో రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. నేల స్వభావాన్ని బట్టి జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాల్లో ఏదొక రకం ఎంచుకొని సాగుకు 20 రోజుల ముందు విత్తుకోవాలి. ముఖ్యంగా సరైన దిగుబడి రాని చౌడుభూములకు పచ్చిరొట్ట ఎంతో ఉపయోగపడుతుంది. పచ్చిరొట్ట ఎరువుల ద్వారా పంటపై రసాయనిక ఎరువుల ప్రభావం తగ్గి ఆరోగ్యవంతమైన ఉత్పత్తులు వస్తాయి.

– కె.చంద్రశేఖర్, మండల వ్యవసాయాధికారి, కోటనందూరు

ప్రభుత్వానికి ప్రజలకు వారధి వలంటీర్లు



వలంటీర్లను అభినందిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు

- జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- వలంటీర్లకు వందనం కార్యక్రమం

కిర్లంపూడి: ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేందుకు వలంటీర్ వ్యవస్థ వారధిగా పనిచేస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. ఎంపీపీ తోట రవి అధ్యక్షతన స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశం హాలులో శనివారం ఏర్పాటు చేసిన 'వలంటీర్లకు వందనం' కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జ్యోతుల చంటిబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు పంపిణీలో ఎటువంటి లంచాలకు తావులేకుండా నేరుగా లబ్ధిదారునికి అందజేయడంలో గ్రామ వలంటీర్ల సేవలు అభినందనీయమన్నారు. నిత్యం గ్రామాల్లో ఉంటూ వారికి అప్పగించిన 50 కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పథకాన్ని అర్హులైన లబ్ధిదారులందరికీ అందించడంలో వలంటీర్ల కృషి ఎంతో ఉందన్నారు. అలాంటి వలంటీర్ వ్యవస్థకు మరింత గౌరవ దక్కేలా 'వలంటీర్‌కు వందనం' కార్యక్రమం ద్వారా సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. తొలిత మండలంలోని సేవారత్నంకు ఎంపికైన కుప్పిలి కాత్యాయని, కంపరపు ఆనంద్, కాకాడ బాలాజీబాబు, చెరకు చినగంగారావుకు నగదుతో పాటు శాలువా కప్పి, మెడల్, ప్రశంస పత్రంతో సత్కరించారు. సేవా మిత్రాలకు ఎంపికైన రూ.396 నగదుతో పాటు ప్రశంస పత్రాలు అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో తోట గాంధీ, వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, కిర్లంపూడి సొసైటీ చైర్మన్ చదలవాడ బాబీ, వైఎస్సార్ మండల పార్టీ అధ్యక్షుడు దోమాల గంగాధర్, వైఎంఎస్‌సీ చైర్మన్ పెంటకోట నాగబాబు, రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ బిళ్లకుర్తి నాగమణి, సంఘన వెంకటేశ్వరావు, మండల సచివాలయాల కన్వీనర్ పెనగంటి రాజేష్, ఎంపీడీఓ బి.ప్రసాద్‌బాబు, ఎస్సై టి.రఘునాథరావు, నాయకులు పాల్గొన్నారు.

పూడికతీత పనులు ప్రారంభం



పంట కాలువల పూడికతీత పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ పర్వత రాజుబాబు

శంఖవరం: గ్రామంలోని పంట కాలువల పూడికతీత పనులను ఎంపీపీ పర్వత రాజుబాబు శనివారం ప్రారంభించారు. ఆయప మాట్లాడుతూ ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ సొంత నిధులతో ఈ అభివృద్ధి పనులు చేపట్టడం అభినందనీయమన్నారు. పంట కాలువలను శుభ్రం చేస్తే సాగునీరు సజావుగా సాగే అవకాముంటుందన్నారు. దీంతో రైతులకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు బైరా శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

ఇంత వేడి ఏల స్వామీ!

- సత్యదేవుని ఆలయంలో వారం రోజులుగా పని చేయని ఏసీలు
- యంత్రాలయంలోనూ అదే పరిస్థితి
- భక్తులు, సిబ్బందికి ఇబ్బందులు



సత్యదేవుని ఆలయంలో ఉక్కపోత భరించలేక వెలుపలకు వస్తున్న భక్తులు

అన్నవరం: సత్యదేవుని ఆలయంలో ఏసీలు పని చేయక భక్తులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకవైపు 40 డిగ్రీల సెల్సియస్‌కు పైబడిన ఉష్ణోగ్రతతో సూర్యుడు ప్రతాపం చూపిస్తున్నాడు. ఈ పరిస్థితుల్లో ఏసీలు పని చేయకపోవడంతో భక్తులు, సిబ్బంది అల్లాడిపోతున్నారు. సత్యదేవుని ఆలయంలో సెంట్రల్ ఏసీ ఉంది. ఇది వారం రోజులుగా పని చేయడం లేదు. రూ.200 టికెట్టుపై భక్తుల అంతరాలయం దర్శనానికి సుమారు పది నిమిషాలు పడుతుంది. ఏసీలు పని చేయకపోవడంతో అప్పటి వరకూ క్యూలో నిలుచుని వేడి, ఉక్కపోతతో భక్తులు, ముఖ్యంగా చిన్న పిల్లలు ఆపసోపాలు పడుతున్నారు. మరోవైపు రోజుకు సుమారు పది గంటల పాటు ఆలయంలోనే ఉండే సిబ్బంది పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారింది. తమకైతే నిప్పుల గుండంలో ఉన్నట్టుందని అర్చకులు వాపోతున్నారు. తెల్లవారుజామున 2 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఒక బ్యాచ్ అర్చకులు విధులు నిర్వహిస్తారు. తిరిగి మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 9 గంటల వరకూ మరో బ్యాచ్ అర్చకులు విధులు నిర్వహిస్తారు. డ్యూటీ పూర్తయ్యే వరకూ ఆలయం నుంచి వెలుపలకు రావడానికి కుదరదు. ఏకాదశి, శుక్ర, సోమవారాల వంటి ముఖ్యమైన రోజుల్లో గర్భాలయంలో ఎక్కువ మంది పురోహితులు, అర్చకులు స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహిస్తారు. అటువంటి పరిస్థితుల్లో ఏసీలు పని చేయక చాలా ఇబ్బంది పడాల్సి వస్తోందని వారు ఆవేదన చెందుతున్నారు. సత్యదేవుని ఆలయం దిగువన ఉన్న యంత్రాలయంలో ఉన్న రెండు స్ప్లిట్ ఏసీలు కూడా పని చేయడం లేదు. ఏసీలకు వెంటనే మరమ్మతులు చేయించి ఇబ్బందులు తొలగించాలని భక్తులు, సిబ్బంది కోరుతున్నారు.

విత్తన గుళికల తయారీపై అవగాహన

జగ్గంపేట: ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో విత్తన గుళికల తయారీపై గొల్లలగుంట గ్రామంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. విత్తన గుళికలు తయారు చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వివరించారు. విత్తన గుళికలు తయారు చేయడానికి ప్రధానంగా సేకరించిన విత్తనాలకు సరిపడా బీజామృతం, మెత్తగా పొడిచేసి జల్లించిన బంకమట్టి పొడి, మెత్తగా పొడి చేసిన ఘన జీవామృతం, జల్లెడ పట్టిన బూడిదతో గుళికలు తయారు చేస్తారన్నారు. విత్తన గుళికలు తయారీ వల్ల విత్తనం నుంచి కాని, భూమి నుంచి కాని వచ్చే తెగుళ్లను నివారించవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కె.గౌరి, పడాల రాజేష్, డి.ఉమాదేవి, డి.లోవలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యం



దుకాణాల్లో తనిఖీ చేస్తున్న కమిషనర్ కొండలరావు

ఏలేశ్వరం: ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ కొండలరావు అన్నారు. పట్టణంలో శనివారం దుకాణాల వద్ద వెళ్లి ప్లాస్టిక్ వాడకం నిషేధంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం నిషేధమన్నారు. దుకాణదారులు ప్లాస్టిక్ వాడితే చర్యలు తీసుకుంటామన్నారు. దీనిపై అనేక సార్లు హెచ్చరించామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట ఏఈ అనూష, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలనకు చర్యలు

తుని: పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ నియంత్రణకు అధికారులు పటిష్ట చర్యలు చేపట్టారు. ప్రజా ఆరోగ్యశాఖ అధికారులు మార్కెట్‌లో తనిఖీలు ముమ్మరం చేశారు. పట్టణంలో పలు దుకాణాల్లో చేసిన తనిఖీల్లో భారీగా కవర్లు స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలు పాటించని వ్యాపారులకు నోటీసులు జారీ చేశారు. 120 మైక్రాన్ల కంటే లోపు ఉన్న కవర్లను వినియోగించొద్దని వ్యాపారులకు హెచ్చరికలు జారీ చేశారు. ప్లాస్టిక్ బదులు గుడ్డ సంచుల వినియోగించాలని కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు. హోటల్స్, చేపల మార్కెట్, కూరగాయలు, టిఫెన్స్ సెంటర్లు, కిరాణా దుకాణాలు తదితర వ్యాపార సెంటర్లలో తనిఖీలు చేశారు.

అయర్లా మహాసభను విజయవంతం చేయాలి

ప్రత్తిపాడు: అనకాపల్లిలో ఈనెల 25వ తేదీన జరగనున్న అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం (అయర్లా) ఐదో మహాసభను విజయవంతం చేయాలని అయర్లా జాతీయ ఉపాధ్యక్షుడు, సీపీఐ (ఎంఎల్) కేంద్ర కమిటీ సభ్యుడు బుగత బంగార్రాజు కోరారు. స్థానిక లిబరేషన్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అదాని, అంబానీ వంటి కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్లు అప్పులను మాఫీ చేస్తున్న కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది (2023–24) వంద రోజుల ఉపాధి పనులకు కేంద్ర ప్రభుత్వం కేంద్ర బడ్జెట్‌లో కేవలం రూ.61 వేల కోట్లు కేటాయించిందన్నారు. ఈ నిధులు దేశ గ్రామీణ కార్మికులకు వంద రోజులు కాదు కదా 15 రోజులు ఉపాధి కల్పించడానికి కూడా సరిపోదన్నారు. గ్యాస్, పెట్రోల్, నిత్యావసరాల ధరలు పెంచేసి పేదవాడిపై భారం వేస్తున్నారన్నారు. మోదీ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా మహాసభ జరుగుతుందన్నారు. వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం ప్రాంగణంలో జరుగనున్న ఈ మహాసభకు అయర్లా జాతీయ అధ్యక్షుడు, బీహార్ రాష్ట్ర లిబరేషన్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, ఎమ్మెల్యే సత్యదేవ్ రామ్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని ఆయన చెప్పారు.

పుచ్చలపల్లి సుందరయ్య సేవలు అపూర్వం



ఏలేశ్వరంలో పుచ్చలపల్లికి నివాళులర్పిస్తున్న సీపీఎం శ్రేణులు

ఏలేశ్వరం: కమ్యూనిస్టు పితామహుడు పుచ్చలపల్లి సుందరయ్య సేవలు అపూర్వమని సీపీఎం మండల కార్యదర్శి పాకలపాటి సోమరాజు అన్నారు. స్థానిక బాలాజీచౌక్ వద్ద శనివారం పుచ్చలపల్లి 38వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ పేద ప్రజల కోసం పుచ్చలపల్లి సుందరయ్య అనేక పోరాటాలు చేశారన్నారు. దేశ పార్లమెంట్‌లో తొలి ప్రతిపక్ష నేతగా పుచ్చలపల్లి ప్రత్యేక గుర్తింపు పొందారన్నారు. అనంతరం బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుండుబిల్లి చక్రం, నడిపల్లి సత్యవతి, ఎస్‌బాబ్జీ, వంగలపూడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ పనులు 4 నెలల్లో పూర్తి

- ప్రజోపయోగ పనులకే నిధులు
- సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి
- ఎంపీ గీతతో కలసి స్కేటింగ్ రింక్ పనుల పరిశీలన

కాకినాడ: నగరపాలక సంస్థ నూతన భవనం మినహా స్మార్ట్ సిటీ పథకంలో చేపట్టిన అభివృద్ధి పనులన్నీ నాలుగు నెలల్లో పూర్తి చేసి వినియోగంలోకి తెస్తామని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన స్థానిక రాజాట్యాంక్ పార్కులోని స్కేటింగ్ రింక్‌ను ఎంపీ వంగా గీత, కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల, అధికారులతో కలసి సందర్శించారు. స్కేటింగ్ రింక్ పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ స్మార్ట్‌సిటీ అభివృద్ధి పనులు నత్తనడకనసాగుతున్నాయంటూ ఇటీవల టీడీపీ నేతలు చేసిన విమర్శలపై మండిపడ్డారు. ఒకరితో వేలెత్తి చూపించుకునేలా తమ పరిపాలన ఉండదని, ఒక క్రమ పద్ధతిలో అభివృద్ధి పనులు పూర్తి చేస్తున్నామన్నారు. గత టీడీపీ హయాంలో కమీషన్ల కోసం కక్కుర్తిపడి అవసరం లేని అభివృద్ధి పనులకు స్మార్ట్ సిటీ నిధులు కేటాయించారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎంపీ గీత సమన్వయంతో తాను ప్రత్యేక దృష్టి సారించి స్మార్ట్ సిటీ నిధులను ప్రజోపయోగ పనుల కోసం వెచ్చించామన్నారు. ప్రతిపాదిత పనులన్నింటినీ నాలుగు నెలల్లో పూర్తి చేసి చూపిస్తామని, అవసరమైతే టీడీపీ నేతలను కూడా తీసుకువెళ్లి చేసిన పనుల ప్రగతిని చూపించేందుకు సైతం సిద్ధమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. స్కేటింగ్ రింక్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో అతిత్వరలోనే వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వాటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, ఎమ్మెల్సీ అభ్యర్థిని కర్రి పద్మశ్రీ, మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, స్మార్ట్‌సిటీ ఎస్ఈ వెంకట్రావు, మాజీ కార్పొరేటర్ రాగిరెడ్డి బన్ని, రోకళ్ల సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు మల్లిపాముల గణపతి తదితరులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలోని కుమారా రామభీమేశ్వరస్వామికి అమ్మవారు బాలా త్రిపుర సుందరిదేవికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ డి.నాగమల్లేశ్వరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు వేమూరి సోమేశ్వరశర్మ, కొంతేటి జోగారావు, సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు విజయ్ ఆలయంలోని ఉప ఆలయాలలోను స్వామి వారు, అమ్మవార్లకు పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

కూలింగ్ వాటర్ ప్లాంట్ ప్రారంభం



ప్లాంట్ ప్రారంభిస్తున్న నాయకులు

ఏలేశ్వరం: స్థానిక భూసమేత బాలాజీ వేంకటేశ్వరాస్వామి (బాలాజీచౌక్) గుడి వద్ద శనివారం ఆలయ ధర్మకర్త గోపు వెంకట్రావు, సుబ్బయ్యమ్మ సహాయంతో ఏర్పాటు చేసిన కూలింగ్ వాటర్ ప్లాంట్‌ను మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ శిడగం త్రివేణి, మాజీ వైస్ చైర్మన్ పైల సత్యనారాయణ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉన్నందున వడదెబ్బ తగలకుండా ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్లాంట్‌ను ఏర్పాటుచేసిన దాతలను అభినందించారు. కార్యక్రమంలో శిడగం వెంకటేశ్వరరావు, సామంతుల సూర్యకుమార్, పైల విజయ్‌కుమార్, రేపాక వెంకటసత్య రామలింగేశ్వరరావు, పాదర్తి సురేష్, గోళ్ల నాగేశ్వరరావు, గోపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏగులమ్మ జాతర

గండేపల్లి: ఉప్పలపాడు గ్రామ దేవత ఏగులమ్మ తల్లి జాతర మహోత్సవం శనివారం ఘనంగా ప్రారంభించారు. ఏటా మాదిరిగానే ఈ ఏడాదిలోను ఈ జాతరను నిర్వహిస్తున్నట్టు సర్పంచ్ అడబాల ఆంజనేయులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని నియోజకవర్గస్థాయి కబడ్డీ పోటీలను ఏర్పాటు చేస్తున్నామని, గ్రామస్తులు, కమిటీ సభ్యుల సహాయ సహకారాలు అందిస్తున్నట్టు పేర్కొన్నారు.

మజ్జిగ పంపిణీ

గోకవరం: స్థానిక ఆర్టీసీ డిపోలో ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ఉద్యోగులకు మజ్జిగ పంపిణీ చేశారు. యూనియన్ నాయకురాలు ఎస్.శాంతికమల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో డీఎమ్‌యు.రామన్న ముఖ్యఅతిథిగా పాల్గొని మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిపో సూపరిండెంట్ అడ్డాల అప్పారావు, ఎంఎఫ్ మూర్తి, ఈయూ డిపో చైర్మన్ పైడిమళ్ల లక్ష్మణ్‌రావు, అధ్యక్షుడు ప్రగడ ప్రసాద్, శ్రీను, ఎస్ఎమ్‌యూ కార్యదర్శి మేడా శ్రీనివాస్, మురళీ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ సూర్య అప్పారావు

జగ్గంపేట: స్థానిక గోకవరం రోడ్డులో సీఐ సూర్యఅప్పారావు శనివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో 31 కేసులకు సంబంధించి రూ.5,425 వసూలు చేసినట్టు ఆయన తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వెళుతున్న వాహనదారులకు విధించిన చలానాలు సక్రమంగా కట్టడంలేదని, వారి నుంచి వసూలు చేశామన్నారు. వాహనయజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దీనితో పాటు సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడుపుతున్న నలుగురుని పట్టుకుని వారి వద్ద నుంచి రూ.2 వేలు అపరాధ రుసుం వసూలు చేసినట్టు చెప్పారు. వాహనాలు నడిపే వారు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, సీబుక్, ఇన్సూరెన్స్, హెల్మెట్ ఉండాలన్నారు.

కౌలు రైతుల సంక్షేమానికి పెద్దపీట



బిళ్లనందూరు సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ చంద్రశేఖర్

కోటనందూరు: కౌలు రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఏఓ చంద్రశేఖర్ అన్నారు. శనివారం మండలంలోని బిళ్లనందూరు, టీజే నగరం గ్రామాల్లో కౌలు కార్డులపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ కౌలు చేస్తున్న రైతులందరికీ కార్డులు ఇవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కౌలుకార్డులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందడం, రాయితీపై ఎరువులు, పురుగుమందులు తీసుకోవడం, పంటను విక్రయించుకోవడానికి మాత్రమే ఉపయోగపడుతుందన్నారు. సర్పంచ్ సుర్ల రాంబాబు, వ్యవసాయ సలహామండలి మండలాధ్యక్షుడు సుర్ల రాజు, వైఎస్సార్ సీపీ నాయకుడు బొత్స సత్తిబాబు, ఏఈఓ శివకుమారి, వీఏఏ భవాని, మంగ రాజుతేజ, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలి

ప్రత్తిపాడు: వేసవి దృష్ట్యా ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలని పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను కోరారు. ఉపాధి హామీ పథకంలో ప్రత్తిపాడులోని సిద్దా వారి చెరువులో జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. పని జరుగుతున్న ప్రదేశంలో తాగునీరు, ఎండ నుంచి రక్షణకు శామ్యూాలు వంటి వసతులు లేకపోవడాన్ని ఆయన గమనించారు. ఉష్ణోగ్రత ప్రభావం అధికంగా ఉండడంతో వడగాల్పుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పని ప్రదేశంలో ప్రతి బంటాకు మంచినీరు ఏర్పాటు చేయాలని ధరణాలకోట శ్రీను అధికారులను కోరారు.

ప్రభుత్వాస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స



ఆపరేషన్ చేయించుకున్న హరీష్‌తో గోకవరం ప్రభుత్వాస్పత్రి వైద్యులు

గోకవరం: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స జరిగింది. గోకవరం మండలంలోని ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన యువకుడు వై.హరీష్ ఆరు నెలల క్రితం ప్రమాదవశాత్తు గాజు పగిలి పెంకు చేతి బొటనవేలులో ఉండిపోయింది. గత ఆరు నెలలుగా తీవ్ర బాధతో ఇబ్బంది పడుతున్నాడు. రెండు రోజుల క్రితం ప్రభుత్వాసత్రికి రాగా ఆస్పత్రి డాక్టర్ రవికుమార్ చేతికి ఎక్స్‌రే తీసి గాజుముక్కను గుర్తించారు. శనివారం సుమారు రెండు గంటల పాటు శస్త చికిత్స చేసి గాజుముక్కను తొలగించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వనజాకుమారి మాట్లాడుతూ గోకవరం ప్రభుత్వాస్పత్రిలో అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ప్రతి నెలా 70 ప్రసవాలు, 30 శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయన్నారు. ప్రజలు ప్రభుత్వాస్పత్రి సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీల్డ్ టెండర్లకు దరఖాస్తుల ఆహ్వానం

తుని: స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలో ఉన్న కత్తిపూడి బస్‌స్టేషన్‌లో ఖాళీగా ఉన్న షాపులకు, ఖాళీ స్థలాలకు వ్యాపారం నిమిత్తం సీల్డ్ టెండర్లను ఆహ్వానిస్తున్నట్టు డిపో మేనేజర్ ఎస్.కిరణ్‌కుమార్ శనివారం తెలిపారు. టెండరు దరఖాస్తులు సోమవారం నుంచి 30వ తేదీ వరకూ ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ తుని డిపో మేనేజరు కార్యాలయంలో అందుబాటులో ఉంటాయన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను సీల్డ్ కవర్‌లో ఉంచి ఈ నెల 31న మధ్యాహ్నం 2 గంటల లోపు తుని డిపో మేనేజర్ కార్యాలయంలో అందజేయాలన్నారు. అదే రోజు సాయంత్రం 4 గంటలకు కమిటీ సమక్షంలో టెండర్లు ఖరారు చేయనున్నట్టు డిపో మేనేజర్ కిరణ్‌కుమార్ తెలిపారు.

వర్షంతో చల్లబడిన వాతావరణం

తొండంగి: కొద్ది రోజులుగా సూర్యతాపానికి భగ్గుమన్న వాతావరణం శనివారం సాయంత్రం కురిసిన మోస్తరు వర్షానికి చల్లబడింది. తీవ్ర ఉక్కపోతతో విలవిల్లాడిన ప్రజలు సేదతీరారు. మరో పదిరోజుల పాటు వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయని వాతావరణశాఖ ప్రకటించిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచించారు.

లైంగిక వేధింపులపై విచారణ జరపాలి



ఏలేశ్వరంలో నిరసన తెలుపుతున్న మహిళలు

ఏలేశ్వరం: మహిళ రెజర్ల లైంగిక వేధింపులపై విచారణ చేపట్టాలని సీపీఐ(ఎంఎల్) వినోద్‌మిశ్రా పార్టీ డిమాండ్‌చేసింది. పార్టీ మహిళా సంఘం ఆధ్వర్యంలో స్థానిక వినోద్‌మిశ్రానగర్‌లో శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మహిళ రెజర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలన్నారు. ఈ ఘటనలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలన్నారు. బీజేపీ అధికారంలో మహిళలపై వేధింపు పెరిగాయన్నారు. కార్యక్రమంలో గుమ్మడి పాదాలమ్మ, గూనాపు వరాలమ్మ, మసిరపు సంకురమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణలో 18 మంది అరెస్టు

ప్రత్తిపాడు: వాకపల్లి గ్రామంలోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవంలో జరిగిన ఘర్షణలో ఇరువర్గాలకు చెందిన 18 మందిని శనివారం ప్రత్తిపాడు పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పోలీసుల కథనం ప్రకారం.. గురువారం అర్ధరాత్రి జాతరలో జరిగిన ఘర్షణలో ఇరువురు గాయపడి ఆసుపత్రి పాలైన సంగతి తెలిసిందే. ఈ ఘర్షణపై శుక్రవారం పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి గ్రామంలో పర్యటించి, జరిగిన సంఘటపై విచారణ చేపట్టారు. ఈ కేసులో ఒక వర్గానికి చెందిన గొర్ల శ్రీనుతో పాటు తొమ్మిది మందిని, మరో వర్గానికి చెందిన వీరెళ్ల కృష్ణతో పాటు తొమ్మిది మందిని అరెస్టు చేసినట్టు ప్రత్తిపాడు ఎస్సై ఎం.పవన్ కుమార్ తెలిపారు.

మహిళ అదృశ్యం

తొండంగి: వివాహిత అదృశ్యమైన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు తొండంగి ఎస్సై ఎస్.రవికుమార్ శనివారం తెలిపారు. గడ్డిపేట గ్రామానికి చెందిన మహ్మద్ జకీర్ తన రెండో చెల్లెలు నుజియా భేగంను ఏలేశ్వరానికి చెందిన మహ్మద్ జవానీతో వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈనెల తొమ్మిదిన నుజియా భేగం తన ఇంటికి పిల్లలతో కలిసి వచ్చింది. 12న మధ్యాహ్న సమయంలో ఇంటి నుంచి తిరిగి బయలుదేరి వెళ్లింది. ఏలేశ్వరం చేరుకోలేదు. చుట్టుపక్కల వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. పెరుమాళ్లపురానికి చెందిన వాసంశెట్టి అప్పలరాజుపై అనుమానం వ్యక్తం చేస్తూ మహ్మద్ జకీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కోడి పందేలపై దాడి

తొండంగి: అద్దరిపేట శివారులో శనివారం కోడిపందేలు నిర్వహిస్తుండగా పోలీసులు దాడిచేశారు. ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అద్దరిపేట శివారులో కోడిపందేలు నిర్వహిస్తున్నట్టు సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి దాడి చేశామన్నారు. ఈదాడిలో ముగ్గరిని అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.460 నగదు, రెండు కోడి కత్తులు, రెండు కోళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.